క్లుప్తంగా

ఆర్‌ఎంపీ శంకర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఆర్‌ఎంపీ డాక్టర్ శంకర్

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ నేర్లశంకర్‌కు మ్యాజిక్ బుక్ ఆఫ్‌రికార్డ్ ఆఫ్ ఢిల్లీ యూనివర్సిటీ శనివారం ఢిల్లీలో డాక్టరేట్ అందజేసి సత్కరించింది. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్, మెజీషియన్ డాక్టర్ సీ.పీ.యాదవ్, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ జర్నాస్ ప్రెసిడెంట్ అనుపమ త్రిగునాయత్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన తెలిపారు. పదేళ్ల ప్రజలకు అందించిన సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ అందించారని పేర్కొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఐటీయూ నేతలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

మంచాల: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం నుంచి పాలకుర్తి నుంచి పాదయాత్రను ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటం సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాండు, మాధవి, అర్జున్, శ్రీను, లక్ష్మమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 500మంది నిరుపేదల ఇండ్లను ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. మండలంలోని పాతకోటతండాకు చెందిన పాత్లావత్ పీర్య ఇంటి నిర్మాణం కోసం శనివారం ట్రస్టు సభ్యులు సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుక, తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు తావుర్యా, రాజేశ్, హుాబ్లా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి: జెడ్పీటీసీ



నిత్యారెడ్డిని సన్మానించిన అధికారులు

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువి ఉన్నతస్థాయికి చేరుకోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నోముల గ్రామంలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉందన్నారు. ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మల్లయ్య బట్టు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం నిత్యారెడ్డిని ఘనంగా సన్మానించారు. మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఉపేందర్‌కు సత్కారం



సీఐ ఉపేందర్‌ను సత్కరిస్తున్న మల్లేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ జాల ఉపేందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర సెలక్షన్ కమిటీ చైర్మన్ మల్లేశ్ గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జోగు రమేశ్, నాయకులు గౌతమ్, కావలి రాములు తదితరులు పాల్గొన్నారు.

దర్శనీయం.. మల్లప్పగుట్ట

- శ్రీశైల మల్లికార్జునుడిగా ప్రసిద్ధి
- ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర
- 16 నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మల్లప్పగుట్ట మీద వెలిసిన శ్రీమల్లికార్జున స్వామి అంటే చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రసిద్ధి. మల్లికార్జున స్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడంటూ భక్తుల నమ్మకం. దీంతో ఇక్కడ ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలువైపుల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. శని, ఆదివారాల్లో సత్యనారాయణ వ్రతాలు, తలనీలాలు, పుట్టు వెంట్రుకలు తదితర ముడుపులు సమర్పిస్తుంటారు.

హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై..

హైదరాబాద్‌కు 60 కి.మీ దూరంలో విఠాయిపల్లికి 3 కిమీ దూరంలో చెన్నారం సమీపంలో మల్లికార్జునుడి శివాలయం ఉంది. దాదాపు 3000 మీటర్ల ఎత్తైన కొండపై ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో ఈ ఆలయం నిర్మించబడి ఉంది.

దాతల సహాయంతో..

ఈ గుడి మొదట చిన్నదిగా ఉండేది. దాతల సహాయంతో ఆలయ నిర్వాహకులు పాండయ్య, పెంటారెడ్డి ఆలయ అభివృద్ధికి పూనుకున్నారు. సుమారు రూ.3 కోట్ల వరకు విరాళాలు సేకరించి వచ్చిన డబ్బుతో ఆలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహాలు, ఏనుగు విగ్రహాలు, గాలిగోపురం, 100 ఫీట్లలో నిర్మించిన విశాలమైన కల్యాణ మండపం, వసతిగృహ సముదాయం, కిచెన్ షెడ్, చెన్నారం గుట్ట కింది నుంచి గుట్ట పైభాగం వరకు వెళ్లడానికి ఆలయ రహదారి, వాటర్‌ట్యాంక్ నిర్మాణాలు చేపట్టారు. ఆలయంలో సకల సౌకర్యాలు కల్పించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 16న ప్రారంభమై 20వ తేదీవరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



మల్లప్పగుట్ట దేవాలయం

ఏర్పాట్లు పూర్తిచేశాం



ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేశాం. వేసవిలో క్యూలైన్లు, ఆలయం ఆవరణలో తాగునీరు కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం.

– పాండయ్య, ఆలయ అధ్యక్షుడు, చుక్కాపూర్

పర్యాటక కేంద్రంగా తీర్చదిద్దాలి



బ్రహ్మోత్సవాలకి ఆలయానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివస్తుంటారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. మౌలిక వసతులు కల్పించాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాను.అధికారులు ఆలయంలో వసతులు కల్పించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, చుక్కాపూర్

కోరికలు నెరవేరుతాయి



శ్రీశైల మల్లికార్జునుడిగా పేరుగాంచిన శ్రీ మల్లప్ప శివాలయంలో భక్తులు కోరిన కోరికలు నెరవేరుతాయనే నమ్మకం ఉంది. మహిమలుగల శివాలయంగా ప్రత్యేకత. ప్రతి యేడాది భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆలయంలో మరిన్ని వసతులు కల్పించడంతో పాటు ఉత్సవాలకు సంబంధించి ప్రచారం చేయాలి.

– విజేందర్‌రెడ్డి, చెన్నారం

తెలంగాణ మోడల్‌పై దేశవ్యాప్త చర్చ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ మోడల్ అభివృద్ధిపై, బీఆర్‌ఎస్ విధి విధానాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీఆర్‌ఎస్ కార్యవర్గ సమావేశం ఆ పార్టీ నేత చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన శనివారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించడానికి విపక్షాలకు దమ్ములేకనే తిట్టడమే రాజకీయన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. అనంతరం ఎంపీపీ కృపేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర ఈనెల 14నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోకి అడుగుపెట్టనున్నదని తెలిపారు. పదిరోజుల పాటు మండలంలో ఈ యాత్ర కొనసాగుతుందని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు కాలే గణేశ్, జగన్నాథం, నర్సింహ, సర్పంచ్‌లు భాస్కర్‌గౌడ్, గీతారాంరెడ్డి, జ్యోతిరాజు, పవిత్రకుమార్, యాదగిరి, హంసమ్మ, ఎంపీటీసీలు మంగ రవీందర్, అచ్చన శ్రీశైలం, నాగమణి పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు తరలిరండి



గిరిజనులతో మాట్లాడుతున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డతండా, శంకరకొండతండా, కొత్తకుంటతండా, సాకిబండతండా, నుచ్చుగుట్ట తండా, సీతారాంనగర్‌తండా, రాంనుంతల తండా, విఠాయిపల్లి తండా, చంద్రాయణపల్లి తండాల్లో శనివారం వారు పర్యటించారు. గిరిజనులతో సేవాలాల్ జయంతి వేడుకల గురించి వివరించారు. జయంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అమర్‌సింగ్, ఈశ్వర్‌నాయక్, శ్రీనునాయక్, గిరిజన సంఘం నాయకులు ప్రశాంత్‌నాయక్, మల్లేశ్ నాయక్, హేమానాయక్, శంకర్, రైసల్‌నాయక్, సోమ్లానాయక్, పాండునాయక్, రాములునాయక్, సురేశ్, నానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- వెంకటాపూర్‌లో ఘనంగా బోనాలు



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శనివారం కోట మైసమ్మ అమ్మవారి ఆలయంలో బొడ్రాయి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పయ్యావుల రమేష్‌యాదవ్, ఎంపీటీసీ సునీత, దర్శన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, రాఘవేందర్ యాదవ్, ఆంజనేయులుగౌడ్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పల్లె, పట్టణాల అభివృద్ధి

యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సత్కరించిన నాయకులు



జాపాలలో వృద్ధురాలి సమస్యలు వింటున్న ప్రశాంత్‌కుమార్ రెడ్డి

మంచాల: గ్రామీణ, పట్టణ ప్రాంతాలను పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో అభివృద్ధి పర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంచాల మండలంలోని జాపాల, కాగజ్‌ఘాట్ గ్రామాల్లో శనివారం ప్రగతి నివేదిన పాదయాత్ర కొనసాగింది. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డితో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మండల అధ్యక్షుడురమేష్, ప్రధాన కార్యదర్శి బహుదూర్, నాయకులు జ్ఞానేశ్వర్, రాంరెడ్డి, సికిందర్‌రెడ్డి, దండేటికార్ రవి, వెంకటేష్, కిషన్‌రెడ్డి, శ్రీశైలం, పీఏసీయస్ వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్ స్వరూప, ఏఎంసీ డైరెక్టర్లు జానీపాష, యాదయ్య, సర్పంచ్ జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

బొక్కల కంపెనీని మూసేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్

యాచారం: కొత్తపల్లి గ్రామంలోని బొక్కల కంపెనీని వెంటనే మూసేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. గ్రామంలోని బొక్కల కంపెనీని శనివారం సందర్శించి నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఫీడ్ కంపెనీ అనే పేరు పెట్టి కళేబరాలతో నూనె తయారు చేస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, నాయకులు సంజీవ, కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్, విప్లవ్‌కుమార్, శ్రీనువాస్‌రెడ్డి, జంగయ్య, శ్రీనువాస్‌గౌడ్ సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను అడ్డుకోవడం దుర్మార్గం

సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య

బడంగ్‌పేట్: హక్కుల కోసం పోరాడుతున్న వడ్డెర జాతుల కులస్తులను అడ్డుకొని నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని బాలాపూర్ మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట యాదయ్య అన్నారు. శనివారం రాష్ట్ర వడ్డెర సంఘం పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాకు సిద్ధమైన వడ్డెర కులస్తులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల సందర్భంగా బీసీ–ఏలో ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. బాలాపూర్ మండలంలోనే సుమారు 6వేల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కేటీఆర్.. పోలీసులను అడ్డం పెట్టుకుని ముందస్తు అరెస్టులు చేయడం తగదన్నారు. అరెస్టులకు భయపడబోమని పోరాటాలతో తమ హక్కులను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు మంజుల భీమయ్య, నర్సింహ, గోపి, బాలు, చిన నర్సింహ, రంగయ్య, యాదయ్య, కొండల్, అంజయ్య, వెంకటేష్, నర్సింహా, రమేష్, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1328 కేసుల పరిష్కారం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 1328 కేసుల్లో కక్షిదారులు రాజీపడ్డారు. లోక్‌అదాలత్‌లో జడ్జిలు ఇందిర, నాగరాజు, అనామిక పాల్గొన్నారు.

రహదారుల దిగ్బంధానాన్ని విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ నేత రమేశ్ మాదిగ

కడ్తాల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టకుండా నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రమేశ్ మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతున్నందున తక్షణమే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు, ఉప కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

‘హాత్ జోడో’ను విజయవంతం చేద్దాం

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా



మాట్లాడుతున్న నర్సింహా

కడ్తాల్: నియోజకవర్గంలో కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం నుంచి ఆదివారం ప్రారంభమయ్యే హాత్‌సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. శనివారం కడ్తాల్‌లో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతంగా పూర్తిచేసిన నేపథ్యంలో.. భారత్ జోడోయాత్ర సందేశాన్ని గడపగడపకు చేర్చాలనే ఉద్దేశంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 11 గంటలకు మైసిగండి మైసమ్మ ఆలయం నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, యాత్ర ప్రారంభించనున్నారని తెలిపారు. సమావేశంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌నాయక్, నాయకులు మల్లేశ్‌గౌడ్, లక్ష్మయ్య, మల్లయ్య, శాబుద్దీన్, ఇమ్రాన్, మహేశ్ తదితరులు ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో 2004-05 బ్యాచ్ విద్యార్థులు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2004-05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. చదువుకున్న రోజుల్లో చేసిన చిలిపి పనులను, గుర్తులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు సన్మానించారు.

అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ

- ఆటో డ్రైవర్లకు పోలీసుల అవగాహన
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



ఇబ్రహీంపట్నం: డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శేఖర్

ఇబ్రహీంపట్నం: రోడ్డు, రవాణా నిబంధనలను డ్రైవర్లు తప్పక పాటించాలని ఎస్ఐ శేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ప్రైవేట్ వాహన డ్రైవర్లకు, యూనియన్ నాయకులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై ఐపీసీ మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శేఖర్ హెచ్చరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

యాచారం: ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా ఆటోలు నడపాలని నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని యాచారం సీఐ సుందరి లింగయ్య హెచ్చరించారు. యాచారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆటో యూనియన్‌కు చెందిన యజమానులు, డ్రైవర్లకు ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మంచాల పీఎస్ పరిధిలో..

మంచాల: డ్రైవర్లు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంచాల సీఐ బత్తిని వెంకటేశం అన్నారు. శనివారం మంచాల పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పరిమితికి మించి ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణికులను తీసుకొనిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎస్ఐ రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్, మన్నెగూడ, ఆదిబట్ల, బొంగ్లూర్ ప్రాంతాల్లో వాహనదారులకు, ప్రయాణికులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె.లక్ష్మీనారాయణ, సురేష్, లక్ష్మినారయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎలాంటి అనుమతులు లేకుండా రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌ను నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొంతం మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బొంగ్లూర్‌లో ఆయన మాట్లాడుతూ.. మంగళ్‌పల్లి రెవెన్యూ పరిధిలో 155లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ ప్లాంట్‌ను నిలిపివేయాలని కోరారు. ఈ వ్యవహారంపై ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు, ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 6 ఎకరాల పొలం వ్యవహారంపై కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివదీక్ష స్వాముల ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివస్వాముల భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం శివస్వాములు గణేశ్, మహేశ్, కుమార్, పవన్, మల్లేశ్, మహేశ్‌లు ఇరుముడులు కట్టుకుని శ్రీశైలం దేవస్థానం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు రేగట్టి శ్రీనివాసులు, స్వాములు వెంకట్, ప్రశాంత్, మహేశ్, శివ, నరేశ్, దేవరాజ్, దుర్గాప్రసాద్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.